విశాలాంధ్ర

జనవరి 6కు మున్సిపల్ సమ్మె వాయిదా : మధు

విశాలాంధ్ర-రాజమండ్రి : మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బరాయుడు,కోకన్వీనర్ శంకర్రావులు మున్సిపల్ సమ్మె ను వాయిద వేస్తూనట్లు చెప్పారని తాటిపాక మధు రమణ దుర్గమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న పారిశుధ్య,ఇంజనీరింగ్ విభాగంలో, ఆఫీస్ సిబ్బందిగా,స్కూల్ స్వీపర్సుగా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లుగా,డ్రైవర్లుగా ఇలా విభిన్న రంగాలలో పనిచేస్తున్నటువంటి పర్మినెంట్ మరియు ఔట్సోర్సింగ్ విభాగంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి అవుట్సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు పర్మినెంట్ చేయాలని ప్రధానంగా సమ్మె నోటీసును డిసెంబర్ 7న రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మికి, సిడిఎంఏ కోటేశ్వరావులకి అందజేశామని, డిసెంబర్ 14న స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి , మున్సిపల్ జేఏసీతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చిన సమస్యలను మినిట్స్ రూపంలో డిసెంబర్ 21న జేఏసీకి అందించారన్నారు. అయితే కేవలం మినిట్స్ ఇస్తే కుదరదని మా డిమాండ్ల ఆమోదించినట్లు ప్రభుత్వము ప్రకటన చేసి,సర్కులర్లు,జీవోలు ఇవ్వాలని జేఏసీ తెలపగా అందుకు మున్సిపల్ శాఖ వారు క్రిస్మస్ పండగ అనంతరం తిరిగి మరో దఫా జేఏసీని పిలిచి సర్కులర్లు అందిస్తామని డిసెంబర్ 31 నాటికల్లా పెండింగ్లో ఉన్న ఇంక్రిమెంట్లు,డిఏలు,ఫ్యూయల్ చార్జెస్,సరెండర్ లీవ్ ల ఎన్కాష్మెంటు బిల్లులన్నీ క్లియర్ చేయాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లకి విసీలు జరిపి గైడెన్స్ ఇచ్చామని, ఫైనాన్స్ శాఖతో మాట్లాడి లేఖ రాశామని, పరిశుద్ధేతర ఔట్సోర్సింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్సు ఇవ్వడానికి సన్నాహకం చేస్తున్నామని కనుక మున్సిపల్ జేఏసీ పది రోజులపాటు ప్రభుత్వానికి గడువు ఇవ్వాలని మేమిచ్చిన డిమాండ్లు పరిష్కరిస్తామని వారు కోరిన మేరకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ జనవరి 5 వరకు ఆగుతామని,అప్పటివరకు దశల వారి ఆందోళనలు యధావిధిగా కొనసాగిస్తూ జనవరి 6నుంచి నిరవధిక సమ్మె చేపడతామని వారు తెలిపారు.ప్రభుత్వం కోరిన గడువు లోపల సమస్యలు పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెను యధావిధిగా కొనసాగిస్తామని వారు తెలిపారు.

సమ్మె వాయిదా : ప్రసాద్

విశాలాంధ్ర -కాకినాడ :మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమ్మె వాయిదా వేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. మున్సిపల్ శాఖ వారు క్రిస్మస్ పండగ అనంతరం తిరిగి మరో దఫా జేఏసీని చేసిన పిలిచి సర్కులర్ అందిస్తామని, వారు కోరిన మేరకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ జనవరి 5 వరకు ఆగుతామని, అప్పటివరకు దశల వారి ఆందోళన యధావిధిగా కొనసాగిస్తామని, జనవరి 6 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం కోరిన గడువు లోపల సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెను యధావిధిగా కొనసాగిస్తామని, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ జిల్లా సమితి తరఫున ఈ చేస్తున్నామని ప్రసాద్ అన్నారు.

అంగన్వాడీలకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి

విశాలాంధ్ర - కరప : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 13వ రోజు ఆదివారం అంగన్వాడీల ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు దంపతులు, టిడిపి మాజీ ఎంపీపీ గుళ్ళపల్లి శ్రీనివాసరావు, చాట్రా ఇమానీలు, మద్దూరు స్వామి, కాకర్ల బుజ్జిబాబు శిబిరానికి విచ్చేసి శిబిరంలోని కూర్చుని అంగన్వాడి మద్దతు తెలిపారు. అంగన్వాడి ప్రాజెక్టు నాయకురాలు పి వీరవేణి మాట్లాడుతూ. ఎస్ వరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, దైవ కుమారి, అచ్చారత్నం, కల్పలత, హెల్పర్ సత్యా మాధవి. ఎం భవాని, నారాయణమ్మ, జ్యోతి, కల్పలత, పి లక్ష్మి, ఏ దేవి, బి మనోజ, లక్ష్మి, సాయి దుర్గ, బి భవాని తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎస్కె అలీషా అధ్యక్షతన ఏపీ మెడికల్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి స్వామి బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి సత్యనారాయణ (పిఎస్) హాజరయ్యారు. ముందుగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జండా ఆవిష్కరణలు పెద్దిరెడ్డి సత్యనారాయణ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బి స్వామి బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాకినాడలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 71 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం నాకు చాలా ఆనందంగా ఉందని, ఇలాంటి వేడుకలు ఎన్నెన్నో జరుపుకోవాలని, ఈ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, రేడియో గ్రాఫర్స్, స్టాఫ్ నర్స్, ముఖ్యంగా ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు మొదలుగా అన్ని క్యాటగిర్లలో ఉన్న వారికి వస్తున్న సమస్యలను పరిష్కరించడంలో ఉన్న ఏకైక యూనియన్ ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అని ఆయన అన్నారు. గతంలో ఆసుపత్రిలో కొన్ని మౌలికమైన సదుపాయాలు కల్పించాలని, సమస్యలను సూపెరెంట్ దృష్టికి ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ద్వారా తెలియజేయడంతో అవి వెంటనే సానుకూలంగా స్పందించి, కొన్ని అమలు జరిపారని, ఇంకా కొన్ని పెండింగ్లో ఉన్నాయని అవి త్వరలో తెలియజేస్తామన్నారు. మళ్లీ పెరుగుతున్న కోవిడ్ కారణంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సిబ్బంది కొరతగా ఉందని అందులో ఎంఎన్ఓ, ఎఫ్ ఎన్ఓలను సిబ్బందిని పెంచాలని, కోవిడ్ తీవ్రతను బట్టి ల్యాబ్ టెక్నీషియన్ కూడా పెంచాలని ఆయన అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకుని 71వ సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్కు అభినందనలు తెలియజేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో కోవిడ్ బారిన పడి మరణించిన వారికి 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేసియా చెల్లిస్తావని వాగ్దానం ఇచ్చారని, కానీ ఎక్కడా అమలు చేయలేదని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కరోనా విపత్తులో చనిపోయిన కుటుంబాలను ఆదుకొని, వారికి తక్షణమే 50 లక్షల ఎక్స్గ్రేసియా చెల్లించాలని ఆయన అన్నారు. జనాభా గనుగుణంగా కోవిడ్కి ప్రత్యేకమైన అదనపు సిబ్బందిని నియమించాలని, నియమించిన సిబ్బందిని కోవిడ్ పూర్తయ్యాక వదిలేయకుండా వారిని పూర్తిగా సాంఘిక భద్రత కల్పించాలని ప్రసాద్ అన్నారు. ఈ సమావేశంలో వి ప్రసన్నకుమార్, నాగబాబు, జగదీష్, వినోద్, వెంకటరమణ, చంటిబాబు, పి శ్రీనివాస్, ఎంఎన్ఓస్, సెక్యూరిటీ గార్డుల తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి హక్కును హరించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజల రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ ఆస్తి హక్కును హరించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆదివారం స్థానిక యుటిఎఫ్ హాల్లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఐలు జిల్లా అధ్యక్షులు మేడ పాటీ ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి హక్కుల యాజమాన్య చట్టం27/2023 అక్టోబర్ 31 నుండి అమల్లోకి తెస్తూ జీవో .నెంబర్ 512 జారీ చేసిందన్నారు. ఈ చట్టం ద్వారా భూమి హక్కుల యాజమాన్యంలో సమూల మార్పులు చేస్తూ రెవెన్యూ అధికారులకు(ల్యాండ్ టైటిలింగ్ అథారిటీ) భూమిపై హక్కులు నిర్ధారించే అధికారం సంక్రమింప చేసిందన్నారు. ఇది ప్రజల రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన భూమి హక్కులకు తీవ్ర విఘాతం కలగజేస్తుందన్నారు. అందుకే న్యాయవాదులు దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు భూ వివాదాలు వచ్చిన నేపథ్యంలో స్థానిక సివిల్ కోర్టుల ద్వారా పరిష్కరించుకునే వారన్నారు. వీటికి అప్పీల్స్కోర్టు పరిధిలోనే ఉండేవన్నారు. కేవలం మ్యుటేషన్ వరకు మాత్రమే రెవెన్యూ అధికారుల చేతుల్లో ఉంటుందన్నారు. కానీ ప్రస్తుత చట్టంలో స్థిరాస్తి హక్కులను నిర్ధారించేందుకు రెవెన్యూ అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వటం రాజకీయ నాయకుల ఒత్తిడికి లోనై తద్వారా ప్రజలకు ఉన్న ఆస్తి హక్కులను హరించే ప్రమాదం లేకపోలేదన్నారు. చట్టంలో న్యాయవ్యవస్థకు ఉన్న అధికారాలను తొలగించి పూర్తిగా రెవెన్యూ అధికారులే ఆస్తి హక్కులను నిర్ధారించడం, వివాదాలు పరిష్కరించడం, సహజ న్యాయ సూత్రాల ప్రాతిపదికగా నిర్ధారణకు రావడం తగదన్నారు. ప్రజల ఆస్తి హక్కు పరిరక్షణకు, భద్రత కోసం న్యాయ వాదులు చేసే పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజకీయ పార్టీలను ప్రజా సంఘాలను కోరారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు న్యాయవాదుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిమెళ్ళ శ్రీ భాస్కరాచార్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏకేఎన్ మల్లేశ్వరరావు, ఆర్జివి పట్నాయక్, కాకినాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెక్క శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది ఎం జవహర్ అలీ, ఐలు కాకినాడ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్ర రాజు, కె నాగ జ్యోతి, సిపిఎం పార్టీ నాయకులు దువ్వ శేష బాబ్జి, ఆర్పిఐ(అంబేద్కర్) రాష్ట్ర కార్యదర్శి పిట్ట వరప్రసాద్, ఆర్సిపిఐ నాయకులు సతీష్, దళిత సంఘం నాయకులు అయితా బత్తుల రామేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమల శెట్టి నాగేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె సింహాచలం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె సత్తి రాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్దంశెట్టి రామకృష్ణ, చొల్లంగి వేణుగోపాల్, టిడిపి నాయకులు గదుల సాయిబాబు, న్యాయవాదులు టివివి రమణమూర్తి, సుధిన శ్రీనివాస్, ఐలూ జిల్లా కమిటీ సభ్యులు గౌతు రాజా, కె దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్యపు హక్కు చట్టాన్ని రద్దు చేయాలి : కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర - రాజోలు : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్యపు హక్కు చట్టం వలన రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో దేవ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన రాజోలు నియోజకవర్గ రైతు సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భూ యాజమాన్యపు హక్కు చట్టం ప్రజల స్థిరాస్తుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు వివాదాలను పరిష్కరించే అధికారం సివిల్ కోర్టు పరిధి నుంచి తప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లాస్థాయి ట్రిబ్యునల్ అధికారులకు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. సామాన్య ప్రజలు ఎవరూ దీనిపై కోర్టులకు వెళ్లే అధికారం లేకుండా చేయడం అన్యాయమని అన్నారు. వెంటనే ఈ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తక్షణమే వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు. అంతర్వేది దేవస్థానం భూములలో అనాదిగా ఇళ్లు నిర్మించుకున్న వారికి శాశ్వత హక్కు కల్పించాలని అన్నారు. భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 27న అఖిలపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ రాష్ట్ర నాయకులు చెల్లబోయిన కేశవశెట్టి, జంపన ప్రసాదరావు, గెద్దం ప్రభాకర్ రావు, భూపతి అజయ్ కుమార్, సిహెచ్ తాతాజీ, నల్లి బుజ్జిబాబు, అడబాల కేశవస్వామి, దొండపాటి చిట్టిరాజు, మేడిచర్ల సత్యనారాయణ, దీపాటి గంగాచలం, వై వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

13వ రోజుకు చేరిన అంగన్వాడీల నిరసన

విశాలాంధ్ర - జగ్గంపేట : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. శనివారం నుంచి అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష మొదలు పెట్టగా ఆదివారం 2వ రోజు దీక్షను కొనసాగించారు. ఈ దీక్షకు కిర్లంపూడి మండలం యూటీఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపి ప్రసంగించారు. ఈ దీక్షకు తాము పూర్తి సంఘీభావం తెలుపుతున్నానని తెలిపారు. అనంతరం నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆది సత్యనారాయణ, మధు, అంగన్వాడి జగ్గంపేట మండల అధ్యక్ష కార్యదర్శులు రత్నం, సుజాతలు తదితరులు పాల్గొన్నారు.

ఏసీఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ జనరల్ సెక్రటరీగా పూర్ణచంద్రరావు నియామకం

విశాలాంధ్ర మండవల్లి: బైరవపట్నం గ్రామానికి చెందిన అల్లాడ నాగ వెంకట పూర్ణచంద్ర రావు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ జనరల్ సెక్రటరీ గా నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ రజిక్ తెలిపారు. విజయవాడలో యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. జాకీర్ షరీఫ్, ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు షేక్ రజిక్ సంయుక్త ఆధ్వర్యంలో నాగ వెంకట పూర్ణచంద్రరావు ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆదివారం జరిగిన పత్రికా సమావేశంలో పూర్ణ చంద్ర రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎ సి ఎఫ్ ఐ గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లి, గ్రామస్థాయిలో సదస్సులు ఏర్పాటు చేసి దీని అవశ్యకత తెలపడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రంలో, దేశంలో అవినీతిపై పోరాడేవారి కొరత తీవ్రంగా ఉందని, అవినీతి అంతం కోసం పట్టుదలతో, చిత్తశుద్ధితో పనిచేసే వారు పెద్దసంఖ్యలో ముందుకు రావాలని ఎ సి ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సు పిలుపునిచ్చిందన్నారు. ప్రజలు కూడా అవినీతి కుంభకోణాల పట్ల మౌనప్రేక్షకుల్లా వ్యవహరించకుండా తమ పరిధిలో అవినీతిని ప్రశ్నించటం, దోషుల్ని శిక్షించేందుకు పోరాడటం చేస్తే తప్ప దేశాన్ని అవినీతి మహమ్మారి నుంచి బైటపడేయలేమని పేర్కొన్నారు. ఎ సి ఎఫ్ ఐ ఆయుధంగా ఉపయోగించుకోవాలని తెలిపారు.

జనవరి 5 6 7 అంతర్జాతీయ తెలుగు మహాసభలు

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సరస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ వెల్లడించారు దేవరపల్లిలో కేశిరాజు సీతారామయ్య స్వగృహ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో గజల్ శ్రీనివాస్ మాట్లాడారు ఎంతో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామని గోదావరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో జనవరి 5 6 7 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు మాతృభాష ఎంతో తీయనిదని మాతృభాషను ఎవరు మర్చిపోవద్దు అని అన్నారు ఆంధ్ర మేన జయతే అన్న నినాదంతో తెలుగు భాష వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే విధంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి భారీ ఎత్తున అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించే సంకల్పం చేస్తామని తెలిపారు గతంలో 2022లో భీమవరంలో తెలుగు మహాసభలు నిర్వహించామని ఇదే స్ఫూర్తితో 2024 జనవరి 5 6 7 తేదీలలో శ్రీ రాజరాజ నరేంద్రుల వారి పట్టాభిషేక మహోత్సవ నరేంద్ర వారి పట్టాభిషేక మహోత్సవ సహస్రబ్ది సందర్భంగా సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఈ మహాసభలకు ఆరుగురు గవర్నర్లు నలుగురు కేంద్రమంత్రులు హైకోర్టు జడ్జీలు సినీ ప్రముఖులు కవులు కళాకారులు హాజరవుతారని తెలిపారు. తెలుగు భాష గుర్తుపట్టే విధంగా అనేక విభాగాలు సంకేత సంస్కృతి కార్యక్రమాలు కూచిపూడి నృత్యం హరికథ బుర్రకథలు కళా ప్రదర్శన తెలుగు వెలుగులకు ప్రతిష్టాత్మకంగా అందజేసే పూర్ణకుంభ పురస్కారాలు ఈ తెలుగు మహాసభలలో అందించటం జరుగుతుందని తెలిపారు. తెలుగు భాషలోని 25 సాహిత్య ప్రక్రియలపై మూడు రోజులు పాటు సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గం శాఖ సభ్యుడు అంబటి శ్రీనివాసరావు కేసిరాజు రాజకుమార్ బండి సూర్య ప్రకాష్ రావు కేశిరాజు సీతారామయ్య ఎంఎస్ చల్లా రావు కేశిరాజు శారదా దేవి కేశి రాజు భారతి డి రమా జానకి వి శేష మణి తదితరులు పాల్గొన్నారు

ఆడుదాం...ఆంధ్ర టోర్నమెంట్ 3 కెరన్

విశాలాంధ్ర ఏలూరు: ఆరోగ్యకర సమాజాన్ని కాంక్షిస్తూ ముఖ్యంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ..ఆంధ్ర క్రీడా సంబరాలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆదివారం నిర్వహించిన 3 కె రన్ ను జిల్లా ఎస్పీ డి .మేరీ ప్రశాంతితో కలిసి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు . కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, డిఆర్వో యం. వెంకటేశ్వర్లు ,నగరపాలక సంస్థ కో ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఆళ్ల సతీష్ చౌదరి, జడ్పీ సీఈఓ కె.సుబ్బారావు ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి, మున్సిపల్ కమిషనర్ ఎస్ .వెంకటకృష్ణ, డి ఎస్ డి ఓ బి. శ్రీనివాసరావు ,హౌసింగ్ పీడీ కె రవికుమార్ ,డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు , ఉద్యానశాఖ డిడి రామ్మోహన్ ,డి ఎల్ డి ఓ లక్ష్మి, డిఎస్ఓ ఆర్ఆర్ రాజు తాహసిల్దార్లు బి సోమశేఖర్ విజయ్ కుమార్ ,ఎంఈఓ సబ్బితి, ఎన్ ఐ సి శర్మ తదితరులు పాల్గొన్నారు.ఉత్సాహపూరితంగా ప్రారంభమైన ఆడుదాం ఆంధ్ర టోర్నమెంటు 3 కె రన్ వట్లూరు సమీపంలోని హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు నుంచి ప్రారంభమై సత్రంపాడు, సి ఆర్ రెడ్డి కళాశాల ,ఆర్టీసి కొత్త బస్టాండ్, జడ్పీ కార్యాలయం మీదుగా ఇండోర్ స్టేడియం చేరుకుంది. ఈ 3 కె రన్ లో పెద్దల నుంచి చిన్నారుల వరకు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ యువతలో క్రీడా ప్రతిభను వెలికి వెలికితీయడమే కాకుండా ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. గ్రామ/ వార్డు సచివాలయ స్థాయి నుంచి 5 దశల్లో పోటీలు నిర్వహించబడతాయన్నారు. జిల్లాలో ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న క్రీడా సంబరాల్లో పాల్గొనేందుకు 1,47,000 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలోని 625 గ్రామ సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడా పోటీల నిర్వహణ కోసం 320 ఆట స్థలాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇందులో క్రికెట్, వాలీబాల్, కోకో, కబాడీ, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించేందుకు 14, 354 టీములను ఏర్పాటు చేసి 7,198 మ్యాచ్ లను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మంచి క్రీడాకారులను గుర్తించడమే కాకుండా వారికి శిక్షణ ఇచ్చి జాతీయస్థాయిలో పోటీలకు పంపించేందుకు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.జిల్లా ఎస్ పి డి .మేరీ ప్రశాంతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభ బయటకు వచ్చేందుకు ఆడుదాం ..ఆంధ్ర కార్యక్రమం మంచి ఫ్లాట్ ఫామ్ అని పేర్కొన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం మానసిక ధైర్యం కలుగుతుందన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ బి .లావణ్య వేణి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు గ్రామ,మండల ,నియోజకవర్గ ,జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించబడతాయని ఇక్కడ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు.ఈ పోటీల్లో ఆయా స్థాయిల్లో కూడా ప్రభుత్వం నగదు బహుమతులను అందిస్తుందన్నారు.

సోమేపలి సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రగతిశీల భావాలు కలిగిన కవిగా, నీతీ నిజాయితీలతో పనిచేసిన ఉత్తమ రెవెన్యూ అధికారిగా, పేదప్రజల పక్షపాతిగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య చేసిన బహుముఖ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు నివాళులు అర్పించారు. ఇటీవల గుంటూరులో కన్నుమూసిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ , కవి , సోమేపల్లి వెంకటసుబ్బయ్య సంస్మరణ సభ తాడేపల్లిగూడెం బీవీఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రం అవరణలో ఆదివారం జరిగింది.బీ వీ ఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం , పెంటపాడు , తణుకు మండలాల్లో పుష్కరకాలం పాటు ఎమ్మార్వోగా పనిచేసిన వెంకట సుబ్బయ్య బివీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక సభ్యులని , సంస్థ గౌరవా ధ్యక్షునిగా విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. మినీ కవిత, నానీ , ప్రక్రియలలో కవిగా పేరుపొందారని, ఆయన రచనలతో పలు కవితా సంకలనాలు ప్రచురణ అయ్యాయని , వారి ఆకస్మిక మరణం సాహితీ లోకానికి తీరని లోటని బుద్ధాల వెంకట రామారావు నివాళులు అర్పించారు.ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ పాత్రికేయునిగా జీవితాన్ని ప్రారంభించిన సోమేపల్లి రెవెన్యూ అధికారిగా , కవిగా , తెలుగు సాహితీ సమాఖ్య, గుంటూరు రచయితల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం వంటి సాహితీ సంస్థల అధ్యక్షునిగా సాహితీ లోకానికి సేవలు అందించారని తెలిపారు.ఎక్కడ పనిచేసినా పేదల పక్షపాతిగా వ్యవహరించారని , ప్రగతిశీల భావాలకు పట్టుకొమ్మగా నిలిచారని తెలిపారు. వ్యక్తిగతంగా వారితో ఎంతో సన్నిహితంగా పనిచేశానని వారు లేని లోటు తీర్చలేనిదని అన్నారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు ఎగ్గిన నాగబాబు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన కొద్దిమంది రెవెన్యూ అధికారులలో వెంకట సుబ్బయ్య ఒకరని, పనుల్లో జాప్యం లేకుండా చూసేవారని, సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారికి వెంటనే పని పూర్తి చేసి పంపేవారని గుర్తు చేశారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో కాల్వగట్ల ఆక్రమణలు తొలగించిన సందర్భంలో అక్కడి పేద వారందరికీ ప్రత్యామ్నాయ స్థలాలు ఇప్పించడం వెనుక వెంకట సుబ్బయ్య కృషి ఎంతో ఉందని, అందువల్లనే పేదలు తమ కాలనీకి వెంకట సుబ్బయ్య నగర్గా పేరు పెట్టుకున్నారని గుర్తు చేశారు.సోమేపల్లి కి నివాళిఅర్పిస్తూ మాట్లాడిన వారిలో శిరిమామిళ్ళ పెద్దిరాజు. అడ్డగర్ల వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయ స్వామి, తాడికొండ శ్రీనివాసరావు , పి.ఎస్.ఎన్.రాజు,కే.ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, కలవలపల్లి సత్యనారాయణ, రామకృష్ణ, లింగంపల్లి గాంధీ , కే.ఆనందరావు, జి.కుమార్, శింగులూరి వీర్రాజు, తొలుత సోమేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భూ హక్కుల చట్టం రద్దుకై ప్రజా పోరాటం అవసరం :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పాలకొల్లు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజల ఆస్తులకు భద్రత లేని 512 జీవో భూ హక్కుల చట్టం రద్దుకై ప్రజా పోరాటం అవసరమని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో భూ హక్కుల చట్టం రద్దు కోరుతూ నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మలకు, సంఘ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ చట్టం అమలుతో ప్రజలకు గలిగే నష్టాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ భూ హక్కుల చట్టం అమలు వలన తరతరాల నుంచి, ముత్తాతల నుంచి ఉన్న ఆస్తులపై ప్రజల హక్కు కోల్పోడమే అన్నారు. ప్రజల ఆస్తులను ప్రభుత్వం తన చేతిలోకి లాక్కొని అమ్మకానికి, తాకట్టుకు పెడుతుందని ఆరోపించారు. ఈ చట్టంతో ఆస్తుల పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్, అడంగల్లు ఇలా 20 రకాలు రద్దు అవుతాయి అన్నారు. ఇటువంటి ప్రజా సమస్యపై నరసా పురం న్యాయవాదుల సంఘం ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సమస్యను టిడిపి, జనసేన అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తానని ఎమ్మెల్యే రామానాయుడు హామీ ఇచ్చారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర- భీమవరం: క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ క్రిస్మస్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర ఏలూరు: క్రిస్టమస్ పండుగని పురస్కరించుకుని జిల్లాలోని క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ క్రిస్మస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ సోదర,సోదరీమణులందరూ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె వాయిదా...

విశాలాంధ్ర ఏలూరు: రాష్ట్రంలో పురపాలకసంఘాలలో నగరపాలక సంస్థలలో నగర పంచాయతీలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగ సిబ్బంది, రెగ్యులర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27 నుంచి చేయనున్న రాష్ట్ర వ్యాప్త మున్సిపల్ కార్మికుల సమ్మెను జనవరి 6వ తేదీ వాయిదా వేసినట్లు ఎఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు తెలిపారు. ఆదివారం నాడు స్థానిక స్ఫూర్తి భవనంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకులు సమావేశం కే విగ్నేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు ఏఐటియుసి ఇతర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసుపై జనవరి 5వ తేదీ వరకు సమ్మెలోకి వెళ్ళొద్దని 5వ తేదీ లోపు కార్మిక సంఘాల సమస్యలపై స్పష్టమైన నిర్ణయాన్ని తెలియజేస్తామని అధికారులు చెప్పినట్లు రామారావు తెలిపారు.జనవరి 5వ తేదీ నాటికి రాష్ట్రస్థాయి మున్సిపల్ అధికారులు మున్సిపల్ కార్మిక సంఘాల సమ్మె నోటీసు పై సరైన సమాధానం చెప్పని ఎడల జనవరి 6వ తేదీ నుండి రాష్ట్ర రాష్ట్ర వ్యాప్త సమ్మెకు మున్సిపల్ కార్మికులు వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శులు సిహెచ్ పుల్లారావు, తొర్లపాటి బాబు, తదితరులు మాట్లాడారు.

రేపు సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర జంగారెడ్డిగూడెం: ఈనెల 26న సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయంలో విలేకరులతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్ లో సిపిఐ ఆవిర్భవించిందన్నారు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ వున్న అన్ని గ్రామ శాఖల్లో సీపీఐ పతాకాలను ఆవిష్కరించి సీపీఐ సాగించిన ప్రజాపోరాటాలు, సాధించిన విజయాలు వివరిస్తూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని కోరారు. దేశ స్వాతంత్ర్య సాధనకు జరిగిన పోరాటంలో వీరోచితంగా పోరాడి ఎంతోమంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి జెవి రమణ రాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గోలిమే బాల యేసు, సిపిఐ మండల కమిటీ సభ్యులు తాళ్లూరి నాగరాజు, జగన్నాథం, చిలంతల రాజుల శ్రీను,తదితరులు పాల్గొన్నారు.